తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు. 250/-లు బహుమతి పొందిన రచన!


# మల్లెపూలు

'బోజ'

ఒకప్పుడు అది పల్లే అయినప్పటికీ రోడ్డు ప్రక్కనే ఉండటం మూలాన బాగా పెరిగి టౌన్ అయి తాలూకాగా మారింది. అందుకే ప్రభుత్వ కార్యాలయాలు, కరెంట్ సబ్‌స్టేషన్, పోలీసు స్టేషన్ వున్నాయి. ఓ ఏడాది క్రితం నుండి కెనాల్ పని జరుగుతుండటం వల్ల ఆ ప్రాంతమంతా ప్రాజెక్ట్ ఏరియాగా మారి దానికి సంబంధించిన ఆఫీసులు కూడా వెలిశాయి.

ఆ ఊరు చివరలో క్రొత్తగా కట్టిన ఓ డాబా, దానిచుట్టూరా ఉన్న ప్రహరీగోడ లోపల పూలమొక్కలు, ఆ యింటికి రోడ్డుకానుకొని ఓ గేటు, కాని ఆ యింటికొచ్చె చాలా మంది, వెనకవైపు ఉన్న పెరటి ద్వారం నుండే వస్తూ పోతుంటారు.

ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు, ఓ పదిమంది మహిళా మండలి సభ్యులు ముందు గేటు తెరుచుకొని లోపలికొచ్చారు. వాళ్ళ ముఖాలలో కోపం కొట్టవచ్చినట్లు కనపడుతోంది. వాళ్ళ శ్వాసలో కసి కనిపిస్తోంది,



అందరూ వరండాలోకొచ్చి నిలుచొని అటుఇటు చూస్తున్నారు. అక్కడగోడకు దేవుని బొమ్మగల ఒకేఒక క్యాలెండరు వేలాడుతోంది. వరండాలోని మేన్‌డోర్ ద్వారానికి ప్లాస్టిక్ పూసల పరదా వేసి ఉంది. దానికి ఒకవైపు అందంగా అలంకరించిన డ్రాయింగ్ రూమ్ ఉంది. మరొకవైపు వున్న గది తలుపు మూసిఉంది. అందులో నుండి చందనపు వాసనొస్తోంది.

'ఎవరు ఇంట్లో' ఓ మహిళ గొంతు.

'......'

'ఈ ఇంట్లో ఎవరూ లేరా' కాస్తగట్టిగా అంది మరొకావిడ బుజానికి వున్న వ్యానిటి బ్యాగ్‌ను సవరించుకుంటూ

'పనిలో వుండొచ్చు' అంది వ్యంగ్యంగా స్లీవ్‌లెస్ జాకెట్ విలాసవతి.

'పగలు కూడా అదేపనా' ద్వందఅర్థం ధ్వనించేట్లుగా అంది.

తలుపు తెరుచుకొని పూసల పరదాను ప్రక్కకు నెట్టికొని వస్తూ'నమస్కారమండి' అంటూ చేతులు జోడించి, అందరివైపూ చూస్తున్న ఆమెకు, ఎవరూ ప్రతి నమస్కారం చేయకుండానే చిత్రంగా చూస్తూ నిలుచున్నారు.

'రండి కూర్చోండి' అంటు ఆమె డ్రాయింగ్ రూమ్ వైపు నడుస్తున్నప్పుడు ముట్టుకుంటే మైల పడిపోతామన్నట్లుగా తోవనిచ్చారే తప్ప, ఆమెను ఎవరూ అనుసరించలేదు.

ఆమె తలంటుస్నానం చేసి వెంట్రుకలను చిందరవందరగా ముడివేసి కనకాంబరాల మాలను చెక్కుకొంది. కంఠపు భాగాన చందనం వ్రాసుకొని, నుదుట కుంకుమ దిద్దుకున్న ఆమె ముఖం సాయంసంధ్యలా ఉంది. రాగిరంగు పట్టుచీర కట్టి అదేరంగు రవికతో బ్రాలేకుండా రొమ్ములను బిగించి కట్టింది. ప్రౌఢవయసులో ఆమె వెలుగుతున్న దీపంలా ఉంది. ఆమెనే చూస్తున్న వాళ్ళ మనసులో ఎంతో అసూయ చోటుచేసుకొన్నట్టు, వాళ్ళ కళ్ళే చెబుతున్నాయి. ఎవరూ తననునసరించడం లేదని గమనించి మయూరి వెనక్కు మళ్ళి,

'మీరు ఎవరింటికో పోవాలనుకొని నాయింటికొచ్చినట్లుంది. నాపేరు మయూరి' అంటూ అందరివైపు నవ్వుముఖంతో చూసింది.

'మాకు నీపేరూ తెలుసూ, నీవుచేసేపని

తెలుసా' అంది వెటకారంగా మహిళామండలి అధ్యక్షురాలు. అదివిన్న మయూరి చిరునవ్వు నవ్వింది.

'ఈ రోజునుంచి ఈ ఊళ్ళో నీపేరు వినపడ కూడదు, వెంటనే ఈ ఊరువదలి వెళ్ళి పోవాలి.' కార్యదర్శిగారి వార్నింగ్

ఈ అనుకోని సంఘటనకు మయూరి నివ్వెరపోయి నిలుచుంది.

'నీ వల్ల మా మగవాళ్ళు యిండ్లకు కూడా సరిగా రావటం లేదు'

ఈసారి మయూరి పడిపడినవ్వింది. అప్పుడామె ముఖంమీద తెల్లని మేఘాలు నడచినట్లనిపించింది.

'ఈ ఊళ్ళో సినిమా టాకీసులు రెండు వున్నాయి. నాలుగు బారుషాపులూ ఉన్నాయి. తెల్లవార్లూ పేకాడుకోటానికి ఓక్లబ్ కూడా ఉంది. అక్కడికి వెళ్ళరా?' అంది ఓమాదిరిగా అందరివైపు చూస్తూ.

'వాటిల్లోకి పోతే ఒక్కడబ్బు మాత్రమే పోతుంది' అంటున్నావిడమీద చూపునిలిపింది మయూరి.

వెనక పెరటి తలుపు తట్టిన శబ్దం

'అదిగో ఎవరో రానే వచ్చినట్లుంది' అంటూ ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

'రాని, లోనికి వచ్చాక ఇద్దర్ని పోలీసులకు పట్టిస్తే' ఒకావిడ సలహా

మయూరి తేరుకొని 'అదేపని నేను చేస్తే' అన్నప్పుడు, ఆమె ముక్కుపుటలు కదిలి కళ్ళల్లో నుండి రోషం తన్నుకొచ్చింది.

ఒక్కసారే వులిక్కిపడ్డారందరూ.

'నా యింటి వరండాలో మీరు, పెరట్లోపరాయి మగాడు, ఒక్కసారి ఆలోచించి బుద్ధిగా వెళ్ళి పోండి. మరెప్పుడైనాసరే యిలాంటి ప్రయత్నం చేయకండి. ఊ వెళ్ళండి' అంటూ లోపలికెళ్ళి తలుపులు మూసుకొంది.

తెల్లముఖాలేసుకుని నిలుచున్నారే తప్ప ఎవరి నోట మాటరాలేదు.

పెరటి తలుపు తెరచి మూసిన చప్పుడు.

మయూరి కాలిమెట్టెలకు ఉన్న వెండిగజ్జల శబ్దం పక్కగదిలోకొచ్చి ఆగిపోయింది.

'ఎంతసేపు బయట నిలుచోవాలి, ఎవరైనా చూస్తే' మగగొంతు.

'పూజలో ఉన్నానండి' అంటు ఆమెచేతులు అతని భుజాలపై వేసి తనపై వంచుకొని ముద్దు పెట్టుకున్నట్లుంది. మణికట్టునుండి మోచేతుల వైపు జారిన గాజుల చప్పుడు, ముద్దాడిన పెదాల చప్పుడూ ఒకటి తర్వాత ఒకటి వినిపించాయి.

'అబ్బ అంతగట్టిగా కౌగలించుకుంటే ఎలా రొమ్ములు అణిగి వెన్నుకు అతుక్కుపోవూ' అంటూ అతని కౌగిలిలో కరిగిపోతున్న శ్వాస చప్పుడు,

'కావాలంటే పెదాలతో బుగ్గలను అదమాలి గాని, పళ్ళతో కొరకొద్దు బాబు నొప్పి పుడతది,' మత్తెక్కిన స్వరంతో 'హు' అన్నాడతడు.

'అంత తొందర, మీ ఆవిడ వూళ్ళో లేదా'

'అదో జడపదార్థం, వున్నా లేకున్నా రెండూ వొకటే'

'చ్చ్ చ్చ్ చ్చ్'

'వొంటి మీదగుడ్డలెందుకు తీసెయ్'

'ఆపని మీరు చేస్తేనే అందం'

అలా ఎంతసేపు గడిచిందో ఎవరికీ తెలియదు, మయూరి తలుపు తెరచుకొని బయట కొచ్చినాక కాని అందరూ ఈ లోకంలోకి రాలేదు.

'మీరింకా యిక్కడే వున్నారా, వెళ్ళిపోయారను కున్నాను. చెదిరిన ముంగురులను సవరించు కుంటూ అంది మయూరి.

'మేము వెళ్ళిపోయామనుకొనేనా పట్టపగలే యింత బరితెగింపు'

'మీరున్నా లేకున్నా నాపనే యిది'

'ఛీ, ఛీ తలచుకుంటే వొళ్ళు గగ్గురుపొడుస్తుంది'

'కాదు పులకరించాలి, స్త్రీ పురుషుల కలయిక ఓ అందమైన అనుభవం అని మీలో ఎందరికి తెలుసు'

'అనుభవమా పాడా పట్టపగలే గుడ్డలిప్పించుకోడం ఎంత పాపమో తెలుసా'


'పాపమా అదేమిటీ స్త్రీ పురుషుల కలయిక పాపమైతే ఈ సృష్టికే అర్థంలేదు. మీరెప్పుడూ మీ భర్తలకు ఇవ్వ వలసినంత శృంగారాన్నివ్వరు కాబట్టే, అదిదొరికే చోటికి పరిగెత్తుకొని పోతారు. వారు మీకు ముద్దిచ్చుకోవడం అంటే సిగ్గు. కౌగిలించుకోవడం అంటే భయం. ఎదో పిల్లల్ని కనడం కోసం చీకట్లో కళ్ళు మూసు కుంటారే తప్ప వెలుగులో, వెన్నెల్లో భర్తలతో ఆడు కోరు. అందుకే మీభర్తలు మిమ్ముల నిష్టపడరు. పసుపు రాసుకొని పట్టుచీరలు కట్టుకొని పేరంటానికెళతారే తప్ప పడక గదిలోకి మాత్రం పాతచీరలతోనే పోతారు. బొట్టు కాటుక, నగలు అలంకరించుకని గుడికి పోతారే తప్ప ఇంట్లో బోసిగానే ఉంటారు.

మల్లెపూలు కొనుక్కొని ఏ మ్యాటి నీకో పోయేటప్పుడు తల్లో పెట్టు కుంటారు తప్ప, రాత్రి వాటిని పెట్టుక్కొని పక్కమీదకు పోరు. మల్లెపూలు పెట్టుకొని మగవాడి కౌగిలిలో వొదిగిపోతే అవి వాళ్ళను ఎంత మత్తెక్కించి, ఆడవాళ్ళను అతుక్కుపోయే ట్లుగా చేస్తాయో మీలో ఎంతమందికి తెలుసు. ఏది ఏమైనా మిమ్ములను చూస్తుంటే నాకే జాలేస్తోంది. రాజకీయాల్లో, ఉద్యోగాల్లో సమాన హోదా కావాలని కోరే మీరు సరసంలో, సంసారంలో కూడా సమాన హోదా కావాలని ఎప్పుడైనా కోరారా, చాకిరీ చేయడమే కాదు సంసారాన్ని స్వర్గంగా మార్చుకోడం తెలుసు కోండి. మీ అందరికీ ఓ నమస్కారం ఇక వెళ్ళమ్ము' అంటూ లోపలి కెళ్ళింది మయూరి. కొంగులతో ముఖాలద్దుకుంటూ అందరూ మౌనంగా అక్కడినుంచి వెళ్ళిపోయారు.

ఆ రోజు సాయంత్రం మయూరి ఏదో నవల చదువుతూ వరండా మెట్లమీద కూర్చుంది. అప్పుడే బజారునుండి వచ్చిన పనిమనిషి 'అమ్మగారూ ఈ రోజు బజారులో మల్లెపూలు దొరకలేదు. అప్పుడే అన్నీ అయి పోయినాయట' అంటూలోపలికి నడిచింది.

చదువుతున్న పుస్తకాన్ని మూసి, అప్పుడే పొడుచుకొస్తున్న నెలవంకను చూస్తూ తనలో తాను నవ్వుతుంది మయూరి

*



## స్వపరిచయం

నల్లగొండ జిల్లా పంతంగి గ్రామంలో 1942వ సంవత్సరంలో జననం. బి.ఎ. వరకు విద్యభ్యాసం. బాల్యం లోనే వివాహం. చిరంజీవులు నలుగురు. ట్రెజరీస్ & అక్కౌంట్సులో ఉద్యోగం.

1960లో 'కష్టసుఖాలు' నాటికతో ప్రారంభమైన రచనా వ్యాసంగం లోకం(కథలు) 'నడుస్తున్న చరిత్ర' (కవితలు) 'గొగ్రెలు'(కథలు), గత సంవత్సరం 'ఎచ్చరిక'(కథలు) ఇంత వరకు జరిగిన ప్రచురణలు కాగా 'వెలుతురు'(కవితలు) ప్రస్తుతం సిద్ధంగా ఉంది.

ఇటీవల నాగార్జున యూనివర్సిటీ వారి శ్రీ శ్రీ స్మారక స్వర్ణ పతకం నా 'ఎచ్చరిక' కథలకు బహూకరించి నందుకు దాన్ని ఓ మహాభాగ్యంగా స్వీకరిస్తూ, నా బాధ్యతను పెంచిందని భావిస్తున్నాను

నన్ను వెన్నుతట్టి నిరంతరం ప్రోత్సహిస్తున్న రా.వి. శాస్త్రి గారికీ, బహుమతి వేదికను ఏర్పాటు చేసిన ఆంధ్రజ్యోతి వారికీ నా ధన్యవాదాలు.

—బోయ జంగయ్య